# వన మహోత్సవానికి సిద్ధం

- నర్సరీలో 50వేల మొక్కలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

**మీర్‌పేట:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో వన మహోత్సవానికి అధికారులు అంతా సిద్ధం చేశారు. వారంరోజుల పాటు జరిగే కార్యక్రమాన్ని శుక్రవారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మంత్రాల చెరువు కట్ట వద్ద మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాలు, స్థానిక నాయకులను భాగస్వాములను చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

**చెరువుల గట్లపై..**

మీర్‌పేట మంత్రాల చెరువు, పెద్ద చెరువు గట్లపై పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఆరు నుంచి 10 వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు చెప్పారు. చెరువుల వద్ద ఖాళీ స్థలాల్లో పూర్తి స్థాయిలో మొక్కలు నాటేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దీంతో పాటు కాలనీల్లోని పార్కు స్థలాల్లో, ఇంటింటికీ పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేస్తామని, ఇందుకోసం 28 వేల మొక్కలు అందుబాటులో ఉంచామని తెలిపారు. డివిజన్ల వారీగా స్థానిక కార్పొరేటర్లతో ఇంటింటికీ మొక్కలు అందజేస్తామని అధికారులు వివరించారు.


నర్సరీలో సిద్ధంగా ఉంచిన మొక్కలు

**మొక్కలు సిద్ధంగా ఉంచాం**



సర్వోదయనగర్ కాలనీలోని నర్సరీలో 16 రకాల పెద్ద వృక్షజాతి మొక్కలు, 12 రకాల చిన్న మొక్కలు ఉన్నాయి. గత సంవత్సరం నుంచి నర్సరీలోనే పలు రకాల మొక్కల పెంపకం చేపట్టాం. మొత్తం 50 వేల వరకు మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు మీటర్ల కంటే ఎక్కువ పొడవున్న మొక్కలను నాటనున్నాం.

– సుధీర్, ఎఫ్‌ఆర్‌ఓ, మీర్‌పేట కార్పొరేషన్


మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చరణ్

## సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు చరణ్

**మీర్‌పేట:** నీట్ పరీక్ష లీకేజీపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు చరణ్ డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ బాలాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని విద్యాసంస్థలను బంద్ చేయించారు. అనంతరం మీర్‌పేట జిల్లెలగూడలోని ప్రభుత్వ పాఠశాలను బంద్ చేయించి ఆయన మాట్లాడుతూ.. 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలని, దేశంలో ఇంతపెద్ద స్కామ్ జరిగినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖామంత్రి రాజీనామా చేయాలని, అదే విధంగా నీట్ పరీక్షను తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు దాసరి అరవింద్, దినేశ్, అఖిల్, కిరణ్, చరణ్, సుమంత్ ఉన్నారు.

## క్లుప్తంగా

### మహేశ్వరం మండల ప్రత్యేకాధికారిగా శ్రీలక్ష్మి


శ్రీలక్ష్మిని సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

**కందుకూరు:** మహేశ్వరం మండల ప్రత్యేకాధికారిగా డిస్ట్రిక్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ జీఎం శ్రీలక్ష్మి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీపీ ఛాంబర్‌లో ఆమె బాధ్యతలు తీసుకోగా, అధికారులు ఆమెకు స్వాగతం పలికారు. కాగా మండలంలోని సమస్యల పరిష్కారానికి అందరం కలిసి పని చేద్దామని ఈ సందర్భంగా శ్రీలక్ష్మి సూచించారు.

### కందుకూరు మండల ప్రత్యేకాధికారిగా వెంకట్


కందుకూరు: వెంకట్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

**కందుకూరు:** కందుకూరు మండల ప్రత్యేకాధికారిగా స్టేట్ ఆడిట్ శాఖ జిల్లా డీడీ వెంకట్ బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఎంపీడీఓ సరితతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని, అందరూ సహకరించాలని కోరారు.

### ఎంపీటీసీలకు ఘన సన్మానం


సన్మానం పొందిన ఎంపీటీసీలు

**కందుకూరు:** కందుకూరు మండల పరిషత్ పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో ఎంపీడీఓ సరిత ఆధ్వర్యంలో గురువారం ఎంపీపీ మంద జ్యోతిపాండు, వైస్ ఎంపీపీ జి.శమంత ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డితో పాటు ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యుడిని అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కాగా సభ్యులు ఐదేళ్ల కాలంలో తాము చేసిన అభివృద్ధి పనులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ సూరజ్ కుమార్ మాట్లాడుతూ.. పదవి ఉన్నా లేకున్నా ప్రజా నాయకుడిగా మారి ప్రజల సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. అందరూ కలిసిమెలిసి ఉంటూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, తహసీల్దార్ గోపాల్, వివిధ పార్టీల నాయకులు ఎల్మటి దేవేందర్‌రెడ్డి, జి.లక్ష్మి నర్సింహారెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, ఎండీ అఫ్జల్ బేగ్, జంగారెడ్డి, మోహన్‌రెడ్డి, భూమిరెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### స్వామి వివేకానందకు నివాళి


వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ అనిల్, తదితరులు

**మీర్‌పేట:** మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలో స్వామి వివేకానంద 122వ వర్ధంతిని కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, ఫ్లోర్ లీడర్ భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల బీరప్ప, బీఆర్ఎస్ అధ్యక్షులు కామేశ్‌రెడ్డి, దీప్‌లాల్‌చౌహాన్, అంజయ్య, గోపి యాదవ్, జ్ఞానేశ్వరచారి పాల్గొన్నారు.

### స్నేహితులకు చేయూత

**కేశంపేట:** తమతో పదో తరగతి వరకు చదివిన తోటి మిత్రుల సమస్యలను గుర్తించిన బాల్య మిత్రులు ముందుకు వచ్చి చేయూతనిచ్చారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1994–95 విద్యా సంవత్సరంలో పదో తరగతి కలిసి చదివిన తోటి మిత్రుడు మంగళిగూడ గ్రామానికి చెందిన శ్రీశైలం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలించగా కాలికి శస్త్ర చికిత్స నిర్వహించారు. విషయం తెలుసుకున్న తోటి మిత్రులు గురువారం రూ.15వేల ఆర్థిక సాయం అందించారు. అలాగే, కొత్తపేట గ్రామంలో తోటి మిత్రురాలు నర్సమ్మ ఇంటి నిర్మాణానికి రూ.30వేల ఆర్థిక సాయం అందించారు. ఆయా కార్యక్రమాల్లో అంజయ్య, ఎల్గనమోని శేఖర్ యాదవ్, శ్రీనివాసులు, బాలరాజ్, నర్సింహ్మా, సురేశ్, పెంటజీ పాల్గొన్నారు.


తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా మహిళా మోర్చా నేతలు

## హామీలను వెంటనే అమలు చేయాలి

**హుడాకాంప్లెక్స్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ జిల్లా అర్బన్ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గురువారం సరూర్‌నగర్ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఏ ఒక్క హామీ అమలు జరగలేదన్నారు. హామీలన్నీ యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని, లేకపోతే ప్రజల తరఫున పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని చెప్పారు. అనంతరం తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నందికొండ గీతారెడ్డి, కే.లయ, కే.పద్మారెడ్డి, నూకల పద్మారెడ్డి, వీణ, అరుణసింగ్, గీతారెడ్డి పాల్గొన్నారు.

## సర్వే నెపంతో కాలయాపన తగదు


కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమి


బడంగ్‌పేట కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బాలాపూర్ దళితులు

- ప్రభుత్వ భూమిని కబ్జా చెర విడిపించండి
- కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు వినతి

**బడంగ్‌పేట్:** విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నా.. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. ఈ విషయమై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా.. కాలయాపనకే ప్రాధాన్యం ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రూ.20 కోట్లకు పైగా విలువ చేసే ప్రభుత్వ ఆస్తిని కాపాడండి మహాప్రభో అని అభ్యర్థిస్తున్నా సర్వే పేరిట.. పరోక్షంగా కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని బాలాపూర్ దళితులు మండిపడుతున్నారు.

**చర్యలు తీసుకోండి..**

ఈ విషయమై బాలాపూర్‌కు చెందిన 16వ డివిజన్ కార్పొరేటర్ ఎర్ర మహేశ్వరి జైహింద్ గురువారం కలెక్టర్‌ను కలిసి కబ్జాలను ఆపేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రఘును కలిసి 74 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ.. వినతిపత్రం అందజేశారు. అధికారులను కలిసిన వారిలో గడ్డం వెంకటేశ్, తిమ్మని గిరీష్, బొర్ర రవి, నిరుడి శ్రీరాములు, ఈ అంజయ్య, పి.ఉమేష్, బి.లక్ష్మణ్, కె. శ్రీధర్ తదితరులు ఉన్నారు.

**2.5 ఎకరాల కబ్జాకు యత్నం**

ఏఆర్‌సీఐ గోడలకు అనుకుని ఉన్న సర్వే నంబర్ 74లో సుమారు 2.5 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా బాలాపూర్‌కు చెందిన సింగిరెడ్డి జైహింద్‌రెడ్డి, దయానంద్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి కలిసి ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో ఏఆర్‌సీఐ ఏర్పాటు అయినప్పుడు 96 దళిత కుటుంబాలకు చెందిన భూమిని తీసుకున్నారని బాధితులు పేర్కొంటున్నారు. ఏఆర్‌సీఐ కాంపౌండ్ నిర్మాణ సమయంలో అక్కడక్కడ మూల మలుపుల వద్ద మిగిలిపోయిన స్థలాలపై కబ్జాదారుల కన్నుపడింది. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని కొందరు పాలకులను, రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని సుమారు రూ.20 కోట్ల విలువ చేసే భూమిని కొల్లగొట్టేందుకు వ్యూహం పన్నారు. గత నాలుగు రోజులుగా ప్రభుత్వ భూమిలో గోడలు నిర్మిస్తున్నారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు మీనమేషాలు వేస్తుండటం వెనకు పెద్ద కుట్రనే దాగి ఉందని తెలుస్తోంది. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్లు ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు పెట్టారు. ప్రస్తుత అధికారులు సర్వే పేరుతో దాట వేస్తుండటం గమనార్హం.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం

**బడంగ్‌పేట్:** ఆరు గ్యారంటీల పేరుతో మహిళలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయాలని గురువారం బడంగ్‌పేటలోని తహసీల్దార్ కార్యాలయంలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రమాదేవి మాట్లాడుతూ.. గత శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మహిళల కోసం ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి రాగానే విస్మరిస్తోందని ధ్వజమెత్తారు. మహిళలకు నెలకు రూ.2500లు, కల్యాణలక్ష్మి చెక్‌తో పాటు తులం బంగారం, వృద్ధ, ఒంటరి మహిళలకు నాలుగువేల పింఛన్, చదువుకుంటున్న విద్యార్థినులకు స్కూటీలు, 5 వందలకే గ్యాస్ వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రోడ్డెక్కి ధర్నాలు, ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్ఐకి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు ఇందిరారెడ్డి, నివేధిత, ఆదిలక్ష్మి, కావ్య, శ్వేత, లతశ్రీ, శ్రీలత, అనిత, కావ్య పద్మజ, సంగీత, మీనాక్షి, నాగమణి, బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


ఆర్ఐకి వినతిపత్రం ఇస్తున్న మహిళా మోర్చా నాయకులు

## మిషన్‌తో మంత్రాల చెరువు సుందరీకరణ

- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**మీర్‌పేట:** మిషన్‌తో మంత్రాల చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మీర్‌పేట మంత్రాల చెరువును గురువారం ఎమ్మెల్యే సందర్శించి మాట్లాడారు. ఇప్పటికే జిల్లెలగూడ చందన చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామని, ఇక మంత్రాల చెరువును అదే విధంగా సుందరీకరించాలని అధికారులను ఆదేశించారు. సుందరీకరణలో భాగంగా చెరువులో నంది విగ్రహం, వాకర్స్ కోసం బెంచీలు, బతుకమ్మ ఘాట్ మెట్లకు రంగులు వేయాలని, వాకింగ్ ట్రాక్‌కు ఇరువైపులా ఆహ్లాదాన్ని పంచేలా మొక్కలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. దీంతో పాటు చెరువులో మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, ఎఫ్‌ఆర్‌ఓ సుధీర్, బీఆర్ఎస్ అధ్యక్షులు కామేష్‌రెడ్డి, దిండు భూపేష్‌గౌడ్, బోయపల్లి శేఖర్‌రెడ్డి, విజయలక్ష్మి, పాల్గొన్నారు.


మంత్రాల చెరువు సుందరీకరణపై అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

**పురాతన కట్టడాలను పరిరక్షించుకోవాలి**

**కందుకూరు:** పురాతన కట్టడాలను పరిరక్షించుకుంటూ మన దేశ సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచానికి చాటేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మహేశ్వరంలోని ప్రాచీన కట్టడం మెట్లబావి(కోనేరు) శిథిలావస్థకు చేరుకోవడంతో దాని అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో సబితారెడ్డి ప్రత్యేక చొరవతో రూ.1 కోటి నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం ఆ పనులు తుది దశకు చేరాయి. దీంతో గురువారం ఆ మెట్లబావిలో జరుగుతున్న పనులను ఆమె స్వయంగా పర్యవేక్షించారు. మిగిలిపోయిన చిన్న చిన్న పనులను సైతం వెంటనే పూర్తి చేసి త్వరగా సందర్శకులకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. పూరాతన కట్టడాలు ఆనాటి నిర్మాణ కౌసల్యం, పనితనానికి నిదర్శనంగా ఉంటాయని, వాటిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకుల విమర్శలు సరికాదు

**బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్జున్**

**బడంగ్‌పేట్:** కాలనీవాసులతో కలిసి బీజేపీ నాయకులు కుట్ర పన్ని కావాలనే రాజకీయం చేస్తున్నారని బడంగ్‌పేట గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ (కార్పొరేటర్) సూర్లగంటి అర్జున్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 28వ డివిజన్‌లోని సప్తగిరి కాలనీలో 710 గజాల పార్కు స్థలం ఉందన్నారు. కొందరు వ్యక్తులు కబ్జా చేసే ప్రయత్నాలు చేయగా కబ్జాకు గురికాకుండా మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ నిధులు రూ.14 లక్షలు వెచ్చించి కాంపౌండ్‌వాల్ నిర్మాణాన్ని 2020లో చేపట్టినట్లు వెల్లడించారు. కాలనీవాసుల కోరిక మేరకు మహిళా మండలి భవనాన్ని నిర్మించాలని కోరగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లి భవన నిర్మాణానికి ఏడాది క్రితం రూ.10 లక్షలు మంజూరి చేయించానన్నారు. అధికారులకు తెలవకుండా పార్కు స్థలంలో శాశ్వత వినాయకుని మండపాన్ని కాలనీవాసులు నిర్మించుకున్నారని తెలిపారు. అనుమతి లేని మండపం నిర్మించారని, మున్సిపల్ కార్పొషన్ అధికారులకు తెలిపి మండపాన్ని ఇటీల కూల్చివేశారన్నారు. కూల్చివేతలకు తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. అర్జున్ కూల్చివేయించాడని ఆరోపించడం సబబు కాదని కాలనీవాసులను బీజేపీ శ్రేణులను హెచ్చరించారు. కాలనీవాసులతో బీజేపీ నాయకులు కుమ్మక్కై హిందూ పేరుతో రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాను కూడా హిందూవునేనన్నారు. అదే పార్కు స్థలంలో మహిళా భవనం నిర్మిస్తామని లేకుంటే నిధులు వెనక్కి వెళ్లిపోతాయని అన్నారు. కాలనీవాసులు రాజకీయం చేయడం మానుకోవాలని హెచ్చరించారు.

## పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య

**తుక్కుగూడ:** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని గురువారం మున్సిపాలిటీలో కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన తెలంగాణ ఉద్యమంలో చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గొరిగే దేవేందర్, శ్రీకాంత్, పవన్, విజయ్, శ్రీనివాస్, మధు, మహేశ్, శ్రీశైలం,రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

**కందుకూరులో..**

**కందుకూరు:** దొడ్డి కొమురయ్య పోరాటం మరువలేనిదని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించారని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమరయ్యను భావితరాలు గుర్తు చేసుకునేలా ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


తుక్కుగూడ: నివాళులర్పిస్తున్న కురుమ సంఘం నాయకులు

**కందుకూలో..**

**కందుకూరు:** మండల కేంద్రంలో కురుమ సంఘం మండల అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య ఆధ్వర్యంలో గురువారం కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బక్క మల్లేశ్, మాజీ సర్పంచ్ గౌర ప్రభాకర్, కురుమ సంఘం నాయకులు ఎగ్గిడి ఐలయ్య, బండ ఆంజనేయులు, గౌర పాండు, మహేందర్, కురుమ యువ చైతన్య సమితి జిల్లా కార్యదర్శి ఎగ్గిడి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

**అమీర్‌పేటలో..**

**కందుకూరు:** మహేశ్వరం మండలం అమీర్‌పేటలో కురుమ సంఘం అధ్యక్షుడు మల్ల శ్రీశైలంఆధ్వర్యంలో గురువారం దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఉన్నారు.


కందుకూరులో..


కందుకూరు: అమీర్‌పేటలో..